సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 21 । జూలై । 2023


లక్డీకాపూల్‌లోని డీఎస్సీ ఆఫీస్ వద్ద వర్షంలో గొడుగులు పెట్టుకుని ఆందోళన చేస్తున్న కేజీబీవీ టీచర్లు

జలదరింపు

దంచికొట్టిన వాన.. జనం హైరానా

మూడ్రోజులుగా వీడని వర్షం
ఆకాశానికి చిల్లు పడిన చందం
తడిసి ముద్దగా మారిన నగరం
లోతట్టు ప్రాంతాలు జలమయం
వరద నీటితో భారీగా ట్రాఫిక్‌జాం
నగర జన జీవనంపై తీవ్ర ప్రభావం


ఖైరతాబాద్ కూడలిలో ఉన్న మ్యాన్‌హోల్‌లో చెత్తను తొలగిస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్

సాక్షి, సిటీబ్యూరో

ఆకాశానికి చిల్లు పడిందా? అన్నట్టుగా మూడ్రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలతో మహానగరం జలమయంగా మారింది. జన జీవనం స్తంభించింది. వర్షాలకు నగరంలో లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. రోడ్లపై భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో ఎక్కడికక్కడే ట్రాఫిక్‌జాం అవుతోంది. సోమవారం రాత్రి చిరుజల్లులతో మొదలై.. గురువారం అర్ధరాత్రి వరకు దంచి కొడుతూనే ఉంది.

లోతట్టు ప్రాంతాలు విలవిల..

నగరంలో భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. టోలీచౌకి మరోసారి నీట మునిగింది. నిజాం కాలనీ, మీరాజ్ కాలనీ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద భారీగా వరద నీరు నిలిచిపోయింది. లింగంపల్లి రైల్వే అండర్ పాస్ కిందకు భారీగా వరదనీరు చేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

కూలుతున్న పాత గృహాలు

ఎడతెరిపిలేని వర్షాలతో దెబ్బతిన్న పురాతన ఇళ్లు కూలిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నెలకొరిగాయి. కవాడిగూడలో శిథిలావస్థకు చేరిన ఇల్లు కుప్పకూలింది. కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బేగం బజార్‌లోనూ పాతఇల్లు వర్షానికి కూలిపోయింది.

రంగంలోకి ఈఆర్టీ..

జలమండలి సుమారు 16 ఈఆర్టీ బందాలను జలమండలి ఏర్పాటు చేసింది. వర్షపు నీరు నిలిచిన ప్రాంతంలో వాటిని తొలగించేందుకు వీరికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. ఆరు ఎస్పీటీ వాహనాలను సైతం అందుబాటులో ఉంచారు. మరో 16 మినీ ఎయిర్ టెక్ వాహనాలను సైతం 24 గంటలు అందుబాటులో ఉంచారు.. ఎక్కడైనా మ్యాన్ హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా.. జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు.

నగరమంతా ట్రాఫిక్ నరకం

రాజధాని రోడ్లపై వాహనశ్రేణులు నత్తలతో పోటీ పడ్డాయి. వరుస వర్షాలతో ఛిద్రమైన రోడ్లన్నీ జలమయంగా మారి.. ట్రాఫిక్ ఎక్కడిక్కడ ఆగిపోయింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని హైటెక్ సిటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. నగర వ్యాప్తంగా దాదాపు 67 ప్రాంతాల్లో ఉన్న వాటర్ లాగింగ్ ఏరియాల కారణంగా రోడ్లన్నీ చెరువులుగా మారి ఎక్కడిక్కడ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడ్డాయి. నాగోలు–మెట్టుగూడ, సికింద్రాబాద్–బేగంపేట్, ఎల్బీనగర్– చాదర్‌ఘాట్, ఎంజే మార్కెట్–నాంపల్లి, పంజగుట్ట–కూకట్‌పల్లి, బయోడైవర్సిటీ సైలాన్–హైటెక్ సిటీ ప్రాంతాల్లో వాహనాలు భారీ సంఖ్యలో ఆగిపోయాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

వర్షాలతో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్ జిల్లాలోని రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ముంపు ప్రాంతాల బాధితులను గుర్తించి వారిని వెంటనే ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు పంపించాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

అప్రమత్తమైన జలమండలి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జలమండలి అప్రమత్తమైంది. ఎండీ దానకిశోర్ ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో గురువారం ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు (ఈఆర్టీ), ఎస్పీటీ వాహనాలు సైతం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

తాగునీటి సరఫరా, నాణ్యతపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తాగునీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా మ్యాన్ హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా.. జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

పురాతన భవనాలతో భయం.. భయం..

పురాతన, శిథిల భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియక పరిసరాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. పురాతన భవనాలపై అప్రమత్తంగా ఉండాల్సిందిగా మేయర్ విజయలక్ష్మి జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. వర్షాలతో ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులకు సూచించారు.

45 ఫిర్యాదులు..

గురువారం మధ్యాహ్నం వరకు జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం డీఆర్‌ఎఫ్‌కు 45 ఫిర్యాదులందాయి. రెండు ప్రాంతాల్లో గోడలు కూలగా, 24 చెట్లు కూలాయి. 15 ప్రాంతాలు నీటమునిగాయి. ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి సైతం క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని పరిశీలిస్తున్నారు. డీఆర్‌ఎఫ్ సహాయం కోసం 90001 13667కు ఫోన్ చేయాల్సిందిగా పేర్కొన్నారు.

విద్యుత్ ఇంజినీర్ల సెలవులు రద్దు

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఇంజినీర్లు, ఇతర సిబ్బంది సెలవులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి చెప్పారు. వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లోని 345 కరెంట్ స్తంభాలు నేలకూలినట్లు తెలిపారు. ఇంజినీర్లు హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు.

ఆరోగ్య శాఖ హెల్ప్‌లైన్

రాంగోపాల్‌పేట్: ప్రజారోగ్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. వర్షాలు, వరదల వల్ల ప్రజలకు కలిగే అనారోగ్య సమస్యలను ఎదుర్కోవటానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి అనారోగ్య సమస్యలు, వరదలు, వర్షాలకు సంబంధించిన సమస్యలు ఉన్నా 24 గంటలు పనిచేసే 8897 54979 నంబర్‌కు కాల్ చేయవచ్చని చెప్పారు. వైద్య సిబ్బంది సెలవులను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ నెల 25 వరకూ భారీ వర్షాలే

ఈ నెల 25 వరకు హైదరాబాద్ జిల్లాలో నిరంతరాయంగా వర్షాలు కురుస్తాయని గురువారం వాతావరణ శాఖ తన నివేదికలో వెల్లడించింది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. కంట్రోల్ రూమ్ నంబర్ 040– 23202813 ఏదైనా సమాచారం కోసం ఫోన్ చేయాలన్నారు.

‘ఎఫ్‌టీఎల్’ దాటిన హుస్సేన్‌సాగర్

వరుస వర్షాలతో హుస్సేన్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టాన్ని దాటింది. పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) 513.41 మీటర్లు కాగా గరిష్ట నీటి మట్టం (ఎండబ్ల్యూఎల్) 514.75 మీటర్లు. గురువారం రాత్రి 7.15 గంటలకు నీరు 513.45 మీటర్లకు చేరుకుంది. కాగా.. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నారు. గతంలోనూ ఎఫ్‌టీఎల్‌ను దాటడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఓయూలో పరీక్షలు వాయిదా

లాలాపేట: ఈ నెల 20, 21 (గురు, శుక్రవారాల్లో) తేదీల్లో ఓయూ పరిధిలో జరగనున్న అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ రిజిస్ట్రార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన పరీక్షల తేదీలను త్వరలో ప్రకటిస్తామని స్పష్టంచేశారు.

క్యాబ్ హైక్.. మెట్రో పీక్..

వరుస వర్షాలతో మెట్రో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. రద్దీ మార్గాల్లో మెట్రో సర్వీసుల సంఖ్య పెంచారు. అయినప్పటికీ క్యాబ్‌లు, ఆటోలకు ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు. క్యాబ్‌లు, ఆటోల చార్జీలు రెట్టింపయ్యాయి. నగరంలోని వివిధ మార్గాల్లో సిటీబస్సు బాగా తగ్గాయి. ట్రాక్ పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల నెపంతో కొద్ది రోజులుగా దక్షిణమధ్య రైల్వే వివిధ మార్గాల్లో పలు ఎంఎంటీఎస్ రైళ్లను సైతం రద్దు చేసింది. ప్రయాణికులు ఎంఎంటీఎస్ సర్వీసుల్లో గమ్యస్థానాలకు చేరుకొనే అవకాశం లేకుండాపోయింది. దీంతో ఎక్కువ మంది ఆటోలు, క్యాబ్‌లు, మెట్రోపై ఆధారపడాల్సి వచ్చింది. బైక్‌లపై వెళ్లే వాహనదారులు సైతం ఎడతెరిపిలేని వర్షాల కారణంగా మెట్రో వైపు మొగ్గు చూపడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. మరోవైపు వర్షం వల్ల స్విగ్గీ, జొమాటో తదితర యాప్‌లకు సైతం డిమాండ్ పెరిగింది. దీంతో ఫుడ్ డెలివరీల్లో జాప్యం చోటుచేసుకుంది. వర్షాలతో క్యాబ్‌ల కొరతను సాకుగా చూపుతూ చార్జీలను రెట్టింపు చేశారు.

ఎక్కడ? ఏమిటీ?

- ఎల్బీనగర్ పరిధిలో ఉద్యోగులు, ఇతర పనులపై బయటికివచ్చిన వారు వర్షంలో అవస్థలు పడ్డారు. అడ్డా కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు.
- దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట పరిధిలోని నల్లగొండ క్రాస్‌రోడ్డు, మలక్‌పేట, సైదాబాద్‌ల్లో ట్రాఫిక్ స్తంభించింది. ఎల్బీనగర్ వరకు రహదారులు గోదారిని తలపించాయి.
- ఉప్పల్– వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా వరద నీటితో నిండటంతో ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు.
- కాప్రా– నాగారం నాలా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు సోనియాగాంధీ నగర్, శుభోదయ కాలనీ, వెస్ట్ గాంధీనగర్ కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
- మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద, ఆర్కే నగర్‌లో చెట్లు కూలాయి. వసంతపురి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.
- కూకట్‌పల్లి పరిధిలోని ఆల్విన్‌కాలనీ ధరణి నగర్‌లో పలు ఇళ్లలోకి పాములు, విష పురుగులు వచ్చాయి. పక్కనే పరికి చెరువు ఉండటంతో పాములు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.
- మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ఓ ఇంటి గోడ కూలింది. మట్టి ఇల్లు కావడంతో వర్షానికి కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.
- చార్మినార్ యునానీ ఆస్పత్రి పైకప్పు పెచ్చులూడిపోయి వర్షపు నీరు వార్డులోకి చేరింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గర్భిణులను పక్క వార్డులోకి తరలించారు. కొంతమందిని డిశ్చార్జి చేశారు.
- గోల్కొండ నానల్‌నగర్ డివిజన్ నదీమ్ కాలనీలోని దిగువ ప్రాంతాల వారు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ సైఫాబాద్ పోలీసులు వరద నీటి ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు చేపట్టినా పరిస్థితి అదుపులోకి రాలేదు.

నగరంలో గురువారం రాత్రి 7 గంటల వరకు వర్షపాతం

ప్రాంతం	సెంటీమీటర్లు
ప్రశాంత్‌నగర్	10.4
మియాపూర్	10.3
కాప్రా	9.8
నాచారం	9.4
హెచ్‌ఎంటీహిల్స్	9.1
మల్లాపూర్	8.9
లాలాపేట	8.4
వెస్ట్ మారేడుపల్లి	8.2
మాదాపూర్	8.1
బంజారాహిల్స్	8.0
హబ్సిగూడ	7.9
నాగోల్	7.9


కృష్ణానగర్‌లో
మూసారాంబాగ్ వద్ద..
బాలానగర్‌లో..
ధరణినగర్‌లో పాము
బంజారాహిల్స్‌లో..
చందానగర్‌లో..
బంజారాహిల్స్‌లో..
అల్తాఫ్‌నగర్‌లో..
వినాయక్‌నగర్‌లో..
సెక్రటేరియట్ వద్ద
ఖానాజీగూడలో ..
ఓక్షిత ఎన్‌క్లేవ్ ప్రధాన రహదారిలో..
ఉప్పల్ -వరంగల్ ప్రధాన రహదారిలో..



పద్మారావునగర్: వెంకటాపురం కాలనీలో కూలిపోయిన వృక్షం


నీట మునిగిన అల్లంతోట బావి ప్రాంతం


ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం


అమీర్‌పేటలో నేలకూలిన చెట్టు..


వివేకానందనగర్‌లో..


మాదాపూర్‌లో ట్రాఫిక్ జాం


చెరువును తలపిస్తున్న బ్రాహ్మణవాడీ కాలనీ


గుడిమల్కాపూర్‌లో..


లింగోజిగూడ డివిజన్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు


అల్తాఫ్‌నగర్‌లో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు..


అల్తాఫ్‌నగర్ కాలనీలో నీట మునిగిన ఇంటిని చూపిస్తున్న మహిళ


అమీర్‌పేట ధరమ్ కరమ్ రోడ్డులో..


గుడిమల్కాపూర్‌లో..


మలక్‌పేటలో..


కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో..


మూసాపేట్ మెట్రో స్టేషన్ సమీపంలో పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్


మెహిదీపట్నంలో రెయిన్ కోట్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


ప్రగతినగర్‌లో చెరువును తలపిస్తున్న మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు


బోడుప్పల్ సాయిరాంనగర్ కాలనీ వీధి నంబర్- 8లో వరద నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న గౌడవెల్లి వాగు


జలమయమైన మలక్‌పేట మెట్రో స్టేషన్

వయస్సు 28.. కేసులు 34

- నకిలీ ఏసీబీ అధికారి అరెస్ట్
- 16 చైన్‌స్నాచింగ్.. 18 నకిలీ ఏసీబీ కేసులు
- 200 సిమ్‌కార్డులు వాడిన నిందితుడు
- జల్సాల కోసమే నేరాలు..



వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: డిగ్రీ పూర్తి చేసిన ఓ యువకుడు విలాసవంతమైన జీవితం కోసం నేరాల బాట పట్టాడు.. చైన్‌స్నాచింగ్‌లతో మొదలు పెట్టి ప్రభుత్వాధికారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతూ మోస్ట్ వాంటెడ్ నేరగాడిగా మరాడు.. కేవలం 28 ఏళ్ల వయస్సులోనే అతడిపై 34 కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఓ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు నకిలీ ఏసీబీ అధికారి అవతారంలో తిరుగుతున్న అతడిని అరెస్ట్ చేశారు. గురువారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు...

అనంతపురం జిల్లా, కోటలపల్లి గ్రామానికి చెందిన నూతేటి జయకృష్ణ(28) 2016లో బీకాం పూర్తి చేశాడు. అనంతరం ఓ టెక్స్‌టైల్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఎస్సై పరీక్షలకు సిద్ధమవుతున్న అతను అనంతపురం పట్టణంలో రెండు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఆయా కేసుల్లో జైలుకు వెళ్లిన అతడికి అక్కడ అనిల్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అనిల్ ద్వారా బెంగళూరులోని శ్రీనాథ్‌రెడ్డి పరిచయమయ్యాడు.

'గ్యాంగ్' స్ఫూర్తిగా తీసుకుని ..

తమిళ హీరో సూర్య నటించిన గ్యాంగ్ సినిమాను చూసిన వీరు దానిని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వాధికారులను మోసం చేయాలని నిర్ణయించుకున్నారు. ఓ పక్క చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూనే మరోవైపు నకిలీ ఏసీబీ ప్రభుత్వాధికారులను బెదిరించి వసూళ్లు చేయడం మొదలుపెట్టారు. 2019లో నకిలీ ఏసీబీగా అవతారమెత్తిన జయకృష్ణ, ఒంగోలు, నెల్లూరు, ఏలూరు, అనంతపురం విశాఖపట్నం, విజయనగరం, తదితర ప్రాంతాల్లోని మున్సిపల్, రెవెన్యూ, రవాణా తదితర రంగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేసి మీపై ఆరోపణలున్నాయి సెటిల్ చేసుకోవాలంటూ వసూళ్లకు పాల్పడ్డాడు. గత మార్చి, జూన్, జులైలో సిద్దిపేటలో ఇద్దరు ఉద్యోగులు, సైబరాబాద్ పరిధిలో ఒకరికి ఇదే తరహాలో ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడ్డాడు. వీరిపై పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 18 కేసులు నమోదయ్యాయి.



నిందితుడు జయకృష్ణ

బస్సుల్లో తిరుగుతూనే..

గుగూల్ ద్వారా ప్రభుత్వ అధికారుల ఫోన్ నంబర్లు సేకరించడంతో పాటు విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల ఆధార్ కార్డుల ద్వారా సుమారు 200 నకిలీ సిమ్‌కార్డులు తీసుకుని వాడినట్లు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేసుకున్న అనంతరం వారు పథకం ప్రకారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కేవారు. రాత్రి వరకు బస్సులో ప్రయాణం చేస్తూనే అధికారులకు ఫోన్ చేసి బెదిరించేవారు. పని పూర్తి కాగానే సిమ్‌ను అక్కడే పారేసేవారు. గత రెండేళ్లలో మొత్తం 9 బ్యాంకు ఖాతాల్లో రూ. గూగుల్ పే, ఫోన్ పే ద్వారా రూ.1.2 కోట్లు వేయించుకున్నట్లు గుర్తించారు. డబ్బులు వచ్చిన వెంటనే గోవా తదితర ప్రాంతాలకు వెళ్లి జల్సాలు చేయడం జయకృష్ణకు అలవాటు. వరస నేరాలతో అప్రమత్తమైన శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు నకిలీ సిమ్‌కార్డుల ఆధారంగా బెంగళూరులో జయకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.85 వేల నగదు, ఖాతాల్లో ఉన్న రూ.2.24లక్షలు, 8 ఫోన్‌లు, 5 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు ఎవరూ కూడా నేరుగా అధికారులకు ఫోన్లు చేయరని ప్రభుత్వాధికారులు దీనిని గుర్తించాలని డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థులు కూడా గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వకూడదని సూచించారు. కేసును చేధించిన శంషాబాద్ ఎస్‌ఓటీ, శంషాబాద్ పోలీసులకు డీసీపీ అభినందించారు.

'నేపాలీ భరత్' వెనుక నేరాల చిట్టా!

- ఇల్లు, లాకర్ తాళాలు పగల కొట్టడంలో 'నిష్ణాతుడు'
- ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారానే సంప్రదింపులు
- అనుమానిస్తున్న నగర పోలీసులు
- పట్టుబడితే వెలుగులోకి రానున్న ఇతడి వ్యవహారాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: రామ్‌గోపాల్‌పేట ఠాణా పరిధిలోని వ్యాపారి విజయ్ కుమార్ గోయల్ ఇంటి నుంచి రూ.కోట్ల సొత్తు కొల్లగొట్టిన నేపాల్ గ్యాంగ్‌లో కీలకంగా వ్యవహరించిన భరత్ బిస్తా కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇతగాడి వ్యవహారశైలి, పూర్వపరాలు, ఎస్ఎస్‌బీ పోలీసులు చెప్పిన వివరాల ఆధారంగా ఇతడికి భారీ నేరాల చిట్టానే ఉంటుందని అనుమానిస్తున్నారు. భరత్ కోసం ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోనూ పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

విశాల్ ద్వారా క్రైమ్ నెట్‌వర్క్‌లోకి...

విజయ్ గోయల్ నివసిస్తున్న ఓం టవర్స్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ భారీ చోరీకి స్కెచ్ వేసిన నేపాలీ షాకర్ మాన్‌సింగ్ సాద్ అలియాస్ కమల్ దీనికోసం అనేక మందిని రంగంలోకి దింపాడు. ప్రకాష్‌నగర్‌లో నివసిస్తూ కేపీహెచ్‌బీలోని ఓ మార్ట్‌లో పని చేస్తున్న మోహన్ సాద్ కూడా ఇలానే కమల్ ముఠాలో చేరాడు. ఇతడి కుమారుడు విశాల్ సాద్ పుణేలోని ఓ హోటల్‌లో పని చేశాడు. ఆ సమయంలో అక్కడ ఠాకాణా బార్ అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పని చేస్తున్న నేపాలీ భరత్ బిస్తాతో విశాల్‌కు పరిచయం ఏర్పడింది. అతడు తాళాలు పగులకొట్టడంలో దిట్ట అని తెలుసుకున్నాడు. విజయ్ ఇంట్లో అల్మారాలు, బీరువాలు పగుల కొట్టడానికి ఓ వ్యక్తి కోసం కమల్ ప్రయత్నిస్తున్న సందర్భంలో విశాల్ ద్వారా భరత్ ఈ క్రైమ్ నెట్‌వర్క్‌లో చేరాడు.

ఎస్ఎస్‌బీ బలగాలకు 'సుపరిచితుడే'...

భరత్ వ్యవహారశైలిని పరిశీలించిన పోలీసులు అతడికి నేరచరిత్ర ఉంటుందని అనుమానించారు. ఈ గ్యాంగ్ కోసం గాలింపు చేపట్టిన నగర పోలీసులు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలతో పాటు వివిధ మార్గాల్లో భరత్‌తో పాటు నలుగురు మినహా మిగిలిన నిందితుల ఫొటోలు సేకరించారు. బెంగళూరులో భరత్ సోదరి ఉన్నట్లు తెలిసి ఓ బృందం అక్కడకు వెళ్లింది. ఆమె నుంచి అతగాడి ఫొటో సేకరించింది. వీరు నేపాల్‌లో అడుగు పెట్టకుండా చేయడం కోసం నగర పోలీసులు సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) బలగాల సహకారం తీసుకున్నారు. కమల్, అతడి భార్య పార్వతి, కుమారుడు వికాస్ తదితరుల ఫొటోలతో పాటు భరత్‌ది కూడా వారికి పంపారు. భరత్ ఫొటో చూసిన వెంటనే అప్రమత్తమైన ఎస్ఎస్‌బీ అధికారులు అతడు తమకు 'సుపరిచితుడే' అని అక్కడికి వెళ్లిన నగర పోలీసులకు చెప్పారు. ఇప్పటికే నాలుగు పోలీసు విభాగాలు అతడి ఫొటోను తమకు పంపాయని వెల్లడించారు.

ఆచూకీ దొరక్కుండా మెసెంజర్ వినియోగం..

నేపాల్ నుంచి వలస వచ్చిన వారిలో అత్యధికులు ఫేస్‌బుక్ మెసెంజర్‌ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే భరత్ మాత్రం అది మాత్రమే వాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తాను వినియోగిస్తున్న ఫోన్ నెంబర్, తన లోకేషన్ ఎవరికీ తెలియకుండా ఇలా చేస్తున్నట్లు పోలీసులు చెప్తున్నారు. తాళాలు పగులకొట్టడంలో అనుభవం, ఎలాంటి ఆధారాలు దొరక్కుండా సంప్రదింపులు, ఎస్ఎస్‌బీ బలగాలకు ఇప్పటికే నాలుగుసార్లు అతడి ఫొటో వెళ్లడం... ఇవన్నీ పరిగణలోకి తీసుకున్న నగర పోలీసులు భరత్‌కు కచ్చితంగా నేరచరిత్ర ఉందని భావిస్తున్నారు. అతడు దొరికితేనే ఎప్పుడెప్పుడు? ఎక్కడెక్కడ? ఏఏ నేరాలు చేశాడు? అనేవి తేలుతాయని చెప్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడ్చల్‌రూరల్: డీసీఎం, బొలేరో ఢీ కొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లంపేట్ శివారులో బుధవారం రాత్రి జాతీయ రహదారిపై బొలేరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. ఈ ఘటనలో మెదక్ జిల్లా, లింగారెడ్డిపేట్‌కు చెందిన డీసీఎం క్లీనర్ కుమార్ యాదవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కుమార్‌యాదవ్ (ఫైల్)

ట్రాఫిక్ డీసీపీలు ఎక్కడున్నారు?

సినీ నటి డింపుల్ హయతి ట్వీట్



బంజారాహిల్స్: ట్రాఫిక్‌లో ఇరుక్కుని చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సినీ నటి డింపుల్ హయతి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ ఫొటోను ట్యాగ్ చేస్తూ నగర పోలీసులు, మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ పరిస్థితి ఘోరంగా ఉందని, ఇంటికి చేరుకోవాలంటే గంటకుపైగా సమయం పడుతుందంటూ ట్వీట్ చేశారు. ఇప్పుడు ట్రాఫిక్ డీసీపీలు ఎక్కడున్నారంటూ ప్రశ్నించారు. ఒక వేళ మెడికల్ ఎమర్జెన్సీ వస్తే ఏం చేయాలి..? మళ్లీ మనం హైదరాబాద్‌లో అడుగు పెట్టగలమా..? ప్రియమైన ప్రభుత్వమా మాకు ఉచితంగా ఇంధనం లభించదు అంటూ పోస్టు చేశారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు నగరవాసులు ఆమెను సమర్థిస్తూ రీ ట్వీట్లు చేశారు. ఆమెను సమర్థించేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది.

'సివిల్స్'తో ప్రజా సేవకు అవకాశం

- బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, బుర్రా వెంకటేశం
- ఓయూలో సివిల్స్ ర్యాంకర్లతో ముఖాముఖి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుర్రా వెంకటేశం

లాలాపేట: ప్రజా సంక్షేమానికి అవసరమైన విధానాలను రూపొందించి వారికి సేవ చేస్తూ గౌరవాన్ని పొందే అవకాశం కేవలం సివిల్ సర్వీసెస్‌లోనే లభిస్తుందని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన సివిల్స్ విజేతలతో ముఖాముఖి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలో దేశంలోనే అత్యున్నతమైన సివిల్ సర్వీస్ సాధించాలన్న లక్ష్యాన్ని ఎంచుకుని గమ్యాన్ని చేరుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ ఏడాది సివిల్స్ టాపర్స్‌లో గురుకుల విద్యా సంస్థల విద్యార్థులు ఉండటం అభినందనీయమన్నారు. గురుకుల విద్య అత్యున్నతమైన క్రమశిక్షణ ఇస్తుందనేందుకు వారే నిదర్శనం అన్నారు. తాను బీసీ గురుకులంలో ప్రాథమిక విద్య, ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించి ఎన్నో అవరోధాలను అధిగమించి సివిల్స్ సాధించినట్లు తెలిపారు. నేడు కొందరు యువత పేదరికాన్ని సవాల్ చేస్తూ సివిల్స్ టాపర్స్‌గా నిలవడం వారి నిబద్ధతకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రతిభావంతులకు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్స్, గ్రూప్స్‌కు కోచింగ్ అందిస్తుందన్నారు. ఇందు కోసం ఓయూలో ప్రత్యేకంగా స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్టడీ సర్కిల్ రూపొందించిన కెరియర్ గైడెన్స్ కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు.

ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ ప్రొ చింత గణేష్ మాట్లాడుతూ సివిల్స్ సాధించాలనే ఆసక్తి ఉన్నవారికి ఉస్మానియా యూనివర్సిటీ అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఓయూ యూజీసీ డీన్ ప్రొ. మల్లేశం మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాదన్నారు. తాను ఎంతో పేదరికం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగానన్నారు.

సివిల్స్‌లో 3 వ ర్యాంక్ సాధించిన ఉమా హారతి, 35వ ర్యాంకర్ సాకేత్ కుమార్, 60వ ర్యాంకర్ సాయి ప్రణవ్, 94వ ర్యాంకర్ సాయికృష్ణ, 200 ర్యాంకర్, మరి కొందరు ర్యాంకర్లు మహేశ్‌కుమార్, రేవయ్య, ప్రణీత్, హిమవంశీ, అపూర్వ తదితరులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఓయూ విద్యార్థులు అడిగిన పలు సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమం అనంతరం విశ్వసాహితీ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మనాన్న అనురాగం డ్యాన్స్ కాంపిటీషన్‌లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమలలో ఓయూ ప్రొఫెసర్లు, బీసీ స్టడీ సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

మహీంద్రా వర్సిటీ, టాస్క్ అవగాహన ఒప్పందం..

'టాస్క్' కలామ్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఎంఓయూ..

సాక్షి, సిటీబ్యూరో: అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) పరిశ్రమలో రాణించడానికి యువతలో నైపుణ్యం యువతలో పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తో మహీంద్రా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ఎంవోయూపై టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మెదురి సంతకాలు చేశారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఇటీవల టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ యూత్ స్కిల్స్ డే కార్యక్రమంలో ఈ ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ వీసీ డాక్టర్ యాజులు మెదురి మాట్లాడుతూ.. 'టాస్క్ – కలాం సెంటర్ ఫర్ ఆటోమోటివ్ ఎక్సలెన్స్'ను స్థాపించడం ఈ సహకార భాగస్వామ్యం లక్ష్యమన్నారు. ఈ భాగస్వామ్యంతో ఈవీ పరిశ్రమలో నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడానికి కృషి చేస్తామన్నారు. టాస్క్– కలాం సెంటర్ ఫర్ ఆటోమోటివ్ ఎక్సలెన్స్ ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో అధునాతన నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణల కోసం అత్యుత్తమ కేంద్రంగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో దీపక్ ఆనంద్, ప్రొవిన్షియల్ పార్లమెంట్ సభ్యుడు అంటారియా, సీఐఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ శేఖర్ రెడ్డి, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ భాస్కర్ తమ్మా, మహీంద్రా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీధర్ మాడిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో కార్ రేసింగ్

- కౌన్సెలింగ్‌కు నిందితులు
- స్వాధీనం చేసుకున్న కార్లు కోర్టుకు అప్పగింత



పోలీసులు సీజ్ చేసిన కార్లు

మణికొండ: కోకాపేట నియోపోలీస్ కేంద్రంగా కార్‌రేసింగ్‌కు పాల్పడిన ఆరుగురు యువకులను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి కౌన్సిలింగ్‌కు తరలించారు. నార్సింగి సీఐ శివకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్ నగరానికి చెందిన కొందరు యువకులు ఖరీదైన కార్లలో శుక్రవారం సాయంత్రం రేసింగ్‌కు పాల్పడుతున్నారు. వీంతో భయాందోళనకు గురైన స్థానికులు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కార్లతో సహా వారిని అదుపులోకి తీసుకున్నారు. నార్సింగి ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రేసర్లను గురువారం కౌన్సెలింగ్‌కు పంపామని, సీజ్ చేసిన కార్లను కోర్టుకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. సదరు కార్లు పాండిచ్చేరి, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయి ఉన్నందున అవి మన రాష్ట్రంలో తిరిగేందుకు అవకాశం ఉందా.. లేదా స్పష్టం చేయాలని ఆర్‌టీఏ అధికారులకు లేఖ రాశామన్నారు. రేసింగ్‌కు పాల్పడిన యువకులు సంపన్న కుటుంబాలకు చెందిన వారు కావడంతో వారి పేర్లను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. వారం రోజుల క్రితం రేసింగ్‌కు పాల్పడితే వారిని గురువారం కౌన్సెలింగ్‌కు, కార్లను కోర్టుకు అప్పగించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రేసింగ్‌కు పాల్పడిన వారిలో సయ్యద్ మాజీద్ హుస్సేన్, రాకేష్, నారాయణ, ధన్‌రాజ్, రమణ, మణికొండ కంఠ శర్మ ఉన్నట్లు సమాచారం.

తన ప్రియురాలికి దగ్గరవుతున్నాడని...

- యువకుడి దారుణ హత్య
- అదృశ్యం కేసు విచారణలో వెలుగులోకి
- నలుగురు నిందితుల్లో ఇద్దరు మైనర్లు



రాజ్‌కపిల్ సాహు(ఫైల్)



నిందితులు రాహుల్ సింగ్, మహ్మద్ తాహెర్

శంషాబాద్: తన ప్రియురాలికి దగ్గరవుతున్నాడనే కోపంతో ఓ యువకుడు మరో ముగ్గురితో కలిసి తన స్నేహితుడిని హత్య చేసిన సంఘటన గురువారం కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరులోని హెచ్ఐఏఎల్ కంపెనీలో పనిచేస్తున్న రాజ్‌కపిల్ సాహూ (20) ఈ నెల 18 మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అదే పరిశ్రమలో పని చేస్తున్న సోమకుమార్ కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రాజ్‌కపిల్‌తో గదిలో కలిసి ఉంటున్న సోనిల్ చౌదరిని విచారించగా రాహుల్ సింగ్ అనే వ్యక్తి కలిసేందుకు వెళ్లిన అతను తిరిగి రాలేదని తెలిపాడు. దీంతో వారు బుధవారం రాత్రి రాహుల్ సింగ్ తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా అతడిని హత్య చేసినట్లు వెల్లడించాడు. తన ప్రియురాలిని గత కొంత కాలంగా రాజ్ కపిల్ ప్రేమిస్తున్నాడని, దీంతో ఆమె తన దూరం పెడుతున్నదన్న కక్షతోనే తన స్నేహితుడి మహ్మద్ తాహెర్, మరో ఇద్దరు మైనర్లతో కలిసి రాహుల్‌ను జనసాయి వెంచర్ వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించిన అనంతరం సీసాలతో పొడిచి బండరాయితో మోది దారుణంగా హత్య చేసినట్లు వెల్లడించాడు. దీంతో పోలీసులు మిగతా ముగ్గురు నిందితులను కూడా అరెస్ట్ చేశారు. ఇద్దరు మైనర్లను జువైనల్‌కు హోంకు తరలించారు. సమావేశంలో శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు, కొత్తూరు సీఐ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాలానుసారం నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వరలక్ష్మి తెలిపారు. ఇంగ్లిష్, కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, ఉర్దూ మీడియంలో చరిత్ర, కెమిస్ట్రీ, జువాలజీ, అరబిక్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, స్టాటిస్టిక్స్ విభాగాల్లో పోస్టులు ఖాళీ ఉన్నాయని, అర్హులైన ఔత్సాహిక అభ్యర్థులు ఈనెల 24వ తేదీ వరకు ఉదయం 11 గంటల లోపు కళాశాల కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులను 25వ తేదీన ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ చేస్తామని పేర్కొన్నారు.

తల్లి మందలించిందని..

ఉపాధ్యాయురాలి ఆత్మహత్య



గాయత్రి (ఫైల్)

బంజారాహిల్స్: వర్షం పడుతోంది... పిల్లలు ఇంట్లోనే ఆడుకునేలా చూడు.. బయటికి వెళ్తే లేనిపోని రోగాలు వస్తాయి... అంటూ తల్లి మందలించడంతో మనస్తాపానికి లోనైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్న మాదివాల్ గాయత్రి(31) ఎన్బీటీ నగర్‌లో తల్లితో కలిసి ఉంటోంది. ఆమెకు ఏడాదిన్నర పాప, మూడు నెలల పాప ఉన్నారు. ప్రస్తుతం మెటర్నిటీ లీవ్‌లో ఉన్న గాయత్రి భర్త సుధీర్ కుమార్ ప్రైవేట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో గాయత్రి తల్లి మనవరాళ్లను కనిపెట్టుకుని ఉంటోంది. అయితే చిన్నారులు తరచూ బయటికి వెళ్తుండటంతో ఇంట్లోనే ఉండేలా చూడాలని కూతురికి పలుమార్లు నచ్చజెప్పింది. పిల్లలను పెంచే పద్ధతి తనకు తెలుసని తల్లి హితవు చెప్పడం నచ్చని గాయత్రి మనస్తాపానికి లోనై ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరి సులోచన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పటిష్ట చర్యలు

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

సాక్షి, సిటీబ్యూరో: ఎడతెగని వర్షాల కారణంగా నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులతో వర్షాకాల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పనిచేసే ఇంజినీరింగ్, సర్కిల్ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాల ద్వారా నీటి నిలువలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగర వాసులకు ట్రాఫిక్ ,ఇతర సమస్యలు తలెత్తకుంగా ఉండేందుకు 157 మొబైల్ బృందాలు, 242 స్టాటిక్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు షిఫ్టుల్లో పనిచేసే బృందాలతో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

- పోలీస్ శాఖ గుర్తించిన 339 వాటర్ లాగింగ్ పాయింట్‌ల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అవసరమైన చోట యంత్రాలతో నీటిని తొలగించాలన్నారు.ఎప్పటి కప్పుడు డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకోవాలన్నారు.
- వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎప్పటి కప్పుడు డ్రైన్ పూడికతీత చేపట్టి నీళ్ల సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఐడీపీఎల్ చెరువు పరిశీలన

- గురువారం రాత్రి ఎడతెగని వర్షాలతో మూసాపేట ఐడీపీఎల్ చెరువు పొంగిపొర్లి రోడ్డుపై ప్రవహిస్తున్న వరదను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పరిశీలించారు. కమిషనర్ వెంట ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, జోనల్ కమిషనర్ మమత, ఎస్ఈ ఆనంద్ తదితరులు ఉన్నారు.



ఐడీపీఎల్ చెరువు పరిసర ప్రాంతాల్లో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్